క్లుప్తంగా

గర్భిణులకు సీమంతం



గర్భిణులకు సీమంతం చేస్తున్న సర్పంచ్

దహెగాం: మండలంలోని హత్తిని గ్రామం అంగన్‌వాడీ కేంద్రంలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో పోషణ మాసం సందర్భంగా గర్భిణులకు సీమంతం నిర్వహించారు. సర్పంచ్ కిన్నెర్ల సుజాత మాట్లాడుతూ గర్భిణులు, బాలింతలు పౌష్టికాహారం తీసుకోవాలని సూచించారు. ప్రతీ నెలా ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వెళ్లి పరీక్షలు చేయించుకోవాలన్నారు. అంగన్‌వాడీ కార్యకర్తలు అల్లి భాగ్య, రంగు భాగ్య, జయప్రద, ఏఎన్‌ఎంలు హేమలత, అనిత తదితరులు పాల్గొన్నారు.

ఒంటికాలిపై మున్సిపల్ కార్మికుల నిరసన



నిరసన తెలుపుతున్న కార్మికులు

కాగజ్‌నగర్‌టౌన్: తమ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ మున్సిపల్ కార్మికులు చేపట్టిన సమ్మె కొనసాగుతోంది. ఇందులో భాగంగా బుధవారం కాగజ్‌నగర్ మున్సిపల్ కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్, పారిశుద్ధ్య కార్మికులు, బిల్ కలెక్టర్‌లు, కంప్యూటర్ ఆపరేటర్‌లు, ఎలక్ట్రిక్, వాటర్ సప్లయ్ కార్మికులు ఒంటికాలిపై నిల్చొని తమ నిరసన తెలిపారు.

‘ఉపాధి అవకతవకలపై చర్యలేవి..?’

కెరమెరి: గత నెల 24న నిర్వహించిన ఉపాధిహామీ ప్రజావేదికలో బయటపడిన అవకతవకలపై చర్యలు ఎందుకు తీసుకోవడం లేదని సీఐటీయూ మండల ప్రధాన కార్యదర్శి కూటికల ఆనంద్ బుధవారం ఒక ప్రకటనలో ప్రశ్నించారు. ఉపాధి పనుల్లో అనేక అక్రమాలు చోటు చేసుకున్నట్లు తనిఖీ అధికారులు ఆధారాలతో నిరూపించినా బాధ్యులపై ఇప్పటివరకు జిల్లా అధికారులు చర్యలు తీసుకోవడం లేదని ఆరోపించారు. ప్రభుత్వ సొమ్మును దుర్వినియోగం చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.


పరామర్శ

జైనూర్: ఇటీవల అనారోగ్యం సమస్యలతో పొలాస గ్రామానికి చెందిన శతాధిక వృద్ధురాలు పవార్ మోతిబాయి మృతి చెందగా బాధిత కుటుంబాన్ని కాంగ్రెస్ నాయకుడు అజ్మీరా శ్యాంనాయక్ బుధవారం పరామర్శించారు.

రాయితీ పరికరాలను సద్వినియోగం చేసుకోవాలి

జైనూర్: వాటర్‌షెడ్ ఆధ్వర్యంలో రైతులకు పంపిణీ చేస్తున్న పరికరాలను సద్వినియోగం చేసుకోవాలని వాటర్‌షెడ్ మేనేజర్ విఠల్‌రావు అన్నారు. బుధవారం మండలంలోని రాసిమెట్ట, దబోలి రైతులకు పైపులు, షేడ్‌నెట్, పవర్ స్ప్రేలు రాయితీపై పంపిణీ చేశారు. కార్యక్రమంలో ప్రజామిత్ర సిబ్బంది నగేశ్, అశోక్, సర్పంచ్ మెస్రం నాగోరావు, మారు, తదితరులు ఉన్నారు.

యువత క్రీడల్లో రాణించాలి



బహుమతులు అందజేస్తున్న కోనప్ప

ఆసిఫాబాద్: క్రీడల్లో యువత రాణించాలని ఎమ్మెల్యే కోనేరు కోనప్ప అన్నారు. బుధవారం మండలంలోని నజ్రూల్‌నగర్ విలేజ్ నం.2లో వినాయక స్పోర్ట్స్‌క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఫుట్‌బాల్ పోటీల ముగింపు కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. గెలుపొందిన విజేతలకు బహుమతులు అందజేశారు. మొదటి బహుమతిని నజ్రూల్‌నగర్ విలేజ్ నం.8, ద్వితీయ బహుమతి విలేజ్ నం. 2 గ్రామాల జట్లు గెలుపొందాయి.

బీజేపీ టికెట్‌కు దరఖాస్తు

ఆసిఫాబాద్‌అర్బన్: ఆసిఫాబాద్ ఎమ్మెల్యేగా బీజేపీ నుంచి తనకు టికెట్ కేటాయించాలని జిల్లా కేంద్రానికి చెందిన కుమ్రం వందన పేర్కొన్నారు. బుధవారం హైదరాబాద్‌లోని బీజేపీ కార్యాలయంలో టికెట్ కోసం ఆమె దరఖాస్తు చేసుకున్నారు. వందన ప్రస్తుతం బీజేపీ మహిళా మోర్చా జిల్లా అధ్యక్షురాలిగా కొనసాగుతున్నారు. నాయకులు కిరణ్‌కుమార్, శ్రీధర్, ప్రకాశ్ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు వేగవంతం చేయాలి

ఆసిఫాబాద్‌అర్బన్: నియోజకవర్గంలో పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులను వేగవంతంగా పూర్తి చేయాలని ఎమ్మెల్యే ఆత్రం సక్కు అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని తన క్యాంపు కార్యాలయంలో సంబంధిత అధికారులతో సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు.

జేపీఎస్‌ల కల సాకారం

- జిల్లాలో 184 మంది జేపీఎస్‌లు
- 161 మంది క్రమబద్ధీకరణ
- నాలుగేళ్ల సర్వీస్ పూర్తయినవారు అర్హులు
- ఉత్తర్వులు అందజేసిన అధికారులు



జేపీఎస్‌లకు క్రమబద్ధీకరణ ఉత్తర్వుల ప్రతులు అందజేస్తున్న కలెక్టర్, ఎమ్మెల్యే (ఫైల్)

కౌటాల: గ్రామాల అభివృద్ధిలో కీలకపాత్ర పోషిస్తున్న జూనియర్ పంచాయతీ కార్యదర్శుల కల సాకారమైంది. పనితీరు ప్రామాణికంగా నాలుగేళ్ల సర్వీస్ పూర్తయిన జూనియర్ పంచాయతీ కార్యదర్శులను రెగ్యులర్ జేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. జేపీఎస్‌లను రెగ్యులర్ చేయాలని ఏప్రిల్ 28 నుంచి మే 13 వరకు రాష్ట్ర వ్యాప్తంగా సమ్మెకు దిగారు. 16 రోజుల సమ్మె తర్వాత ప్రభుత్వ హామీ మేరకు సమ్మె విరమించి విధుల్లో చేరారు. దీంతో ప్రభుత్వం వారిని రెగ్యులర్ చేయడానికి ప్రత్యేక కమిటీ వేసి పనితీరు ఆధారంగా సర్వీసును రెగ్యులరైజ్ చేస్తోంది.

నాలుగేళ్ల క్రితం నియామకం

రాష్ట్ర ప్రభుత్వం 2019లో ప్రత్యేక పరీక్ష నిర్వహించి జూనియర్ పంచాయతీ కార్యదర్శులను నియమించింది. జిల్లాలో 335 గ్రామ పంచాయతీలుండగా, ప్రస్తుతం రెగ్యులర్ పంచాయతీ కార్యదర్శులతో పాటు 184 మంది జూనియర్ పంచాయతీ కార్యదర్శులు, 51 మంది అవుట్ సోర్సింగ్ పంచాయతీ కార్యదర్శులు విధులు నిర్వహిస్తున్నారు. 2019లో జేపీఎస్‌లుగా ఎంపికైన వారికి ప్రభుత్వం తొలుత మూడేళ్ల పాటు కాంట్రాక్ట్ పద్ధతిలో పని చేయాలనే నిబంధన విధించింది. జూలై 17, 2021న ఈ నిబంధనను నాలుగేళ్లకు పెంచింది. కాగా ఈ ఏడాది ఏప్రిల్ 11న జేపీఎస్‌లు నాలుగేళ్ల గడువు పూర్తి చేసుకున్నా ప్రభుత్వం తమ సర్వీసులను క్రమబద్ధీకరించకపోవడంతో నిరసనగా జేపీఎస్‌లు సమ్మె బాట పట్టారు. దీంతో పనితీరు ఆధారంగా సర్వీసులను క్రమబద్ధీకరించాలని ప్రభుత్వం నిర్ణయించింది.

161 మంది రెగ్యులరైజ్..

జిల్లాలో నాలుగేళ్ల సర్వీస్ పూర్తయిన 161 మంది జూనియర్ పంచాయతీ కార్యదర్శుల ఉద్యోగాలను క్రమబద్ధీకరిస్తున్నారు. వారి పని తీరు ఆధారంగా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ గ్రామాల వారీగా పరిశీలించి క్రమబద్ధీకరణ ప్రక్రియ పూర్తి చేశారు. నాలుగేళ్లు పూర్తి చేసుకున్న 161 మంది జూనియర్ పంచాయతీ కార్యదర్శులను క్రమబద్ధీకరిస్తూ ఇటీవల కలెక్టర్ హేమంత్ బోర్కడే, అదనపు కలెక్టర్ దీపక్ తివారి, సిర్పూర్(టి) ఎమ్మెల్యే కోనేరు కోనప్పతో కలిసి ఉత్తర్వుల ప్రతులు అందజేశారు. మిగతా 23 మంది జేపీఎస్‌ల నాలుగేళ్ల సర్వీస్ ఈ నెలలో పూర్తి కానుంది. కానీ ప్రభుత్వం మళ్లీ ఎప్పుడు ప్రొసిడింగ్ ఇస్తోందో స్పష్టత లేదని జూనియర్ పంచాయతీ కార్యదర్శులు ఆందోళన చెందుతున్నారు. త్వరలో నాలుగేళ్లు పూర్తి చేసుకుంటున్న 23 మంది జేపీఎస్‌లను సైతం సకాలంలో క్రమబద్ధీకరిస్తూ ఉత్తర్వులు అందించాలని వారు కోరుతున్నారు.

పనితీరుకు దక్కిన ఫలితం



ప్రభుత్వం ఇచ్చిన మాట ప్రకారం తమను క్రమబద్ధీకరిస్తూ ఇటీవల అధికారులు తమకు ఉత్తర్వుల ప్రతులు అందజేశారు. తమ నాలుగేళ్ల పనితీరుకు దక్కిన ఫలితం ఇది. ప్రభుత్వం తమను క్రమబద్ధీకరించడంతో తమపై మరింత పని బాధ్యత పెరిగింది. ప్రజలకు మరింత సేవ చేసే అవకాశం లభించింది. గ్రామాల్లో ప్రజలకు అందుబాటులో ఉండి గ్రామాభివృద్ధికి పాటుపడుతాం.

- రజిత, పంచాయతీ కార్యదర్శి, తాటిపల్లి, కౌటాల

ఓపీఎస్‌లకూ ఉద్యోగ భద్రత కల్పించాలి



ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలులో పంచాయతీ కార్యదర్శుల పాత్ర చాలా కీలకం. జిల్లాలోని 184 మంది జేపీఎస్‌లలో నాలుగేళ్ల సర్వీస్ పూర్తయిన 161 మందిని రెగ్యులరైజ్ చేశారు. మిగతా 23 మంది కార్యదర్శుల సర్వీస్ ఈనెలలోనే పూర్తికానుంది. వీరికి కూడా సకాలంలో ప్రొసిడింగ్ కాపీలు అందించాలి. ఓపీఎస్‌లను కూడా ప్రభుత్వం జేపీఎస్‌లుగా మార్చి ఉద్యోగ భద్రత కల్పించాలి.

- కృష్ణ, జేపీఎస్‌ల సంఘం జిల్లా అధ్యక్షుడు

పోగొట్టుకున్న సెల్‌ఫోన్ అప్పగింత

ఆసిఫాబాద్: ఈజ్‌గాం పోలీస్‌స్టేషన్ పరిధి జంబుగ గ్రామం నుంచి కాగజ్‌నగర్‌కు వెళ్లే మార్గమధ్యలో ఈనెల 4న రియాజ్ అనే వ్యక్తి సెల్‌ఫోన్ పోగొట్టుకున్నాడు. పోలీసులకు ఫిర్యాదు చేయగా బుధవారం ఈజ్‌గాం ఎస్సై రమణ్‌కుమార్ పోయిన సెల్‌ఫోన్ గుర్తించి బాధితుడికి అప్పగించారు.

బ్యాగ్ అప్పగింత

చింతలమానెపల్లి మండలం బాబాసాగర్ గ్రామానికి చెందిన శ్రీశైలం అనే విద్యార్థి బుధవారం కాగజ్‌నగర్ మండలం ఈజ్‌గాం నుంచి కాగజ్‌నగర్‌కు వెళ్లే మార్గమధ్యలో తన బ్యాగ్ పోగొట్టుకున్నాడు. బెజ్జూర్ మండలం మర్తడి గ్రామానికి చెందిన దుర్గం ప్రవీణ్, గొర్లపల్లి విఠల్‌లకు బ్యాగ్ దొరకగా వారు ఈజ్‌గాం పోలీసులకు అప్పగించారు. బ్యాగులో ఉన్న ఆధారాల ప్రకారం పోలీసులు శ్రీశైలానికి బ్యాగ్ అప్పగించారు. ఈజ్‌గాం ఎస్సై రమణ్‌కుమార్ పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

పర్సు అందజేత



సెల్‌ఫోన్ అప్పగిస్తున్న ఈజ్‌గాం పోలీసులు

బస్సులో పోగొట్టుకున్న పర్సును తిరిగి ప్రయాణికురాలికి ఆర్టీసీ సిబ్బంది బుధవారం అందజేశారు. జిల్లా కేంద్రానికి చెందిన ఉపాధ్యాయురాలు సంతోషిరాణి బుధవారం కాగజ్‌నగర్ నుంచి ఆసిఫాబాద్‌కు బస్సులో ప్రయాణించింది. ఈ క్రమంలో బస్సులో తన పర్సు పోగొట్టుకుంది. ఆర్టీసీ అధికారులకు సమాచారం అందించగా బస్సులో పర్సును గుర్తించి బాధితురాలికి అందజేశారు. పర్సులో రూ.8వేలు నగదు, ఏటీఎం కార్డు, ఐడెంటిటీ కార్డు ఉన్నాయని, పర్సును అప్పగించినందుకు ఆర్టీసీ సిబ్బందికి బాధితురాలు కృతజ్ఞతలు తెలిపింది. ఎస్టీఐ అజ్మీర సరియా, నిర్మల, బాబురావు, కండక్టర్ తాజ్ ఉన్నారు.

కొనసాగుతున్న ‘ఎన్‌హెచ్‌ఎం’ ఉద్యోగుల నిరసన

ఆసిఫాబాద్‌అర్బన్: సీఎం కేసీఆర్ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు ఎన్‌హెచ్‌ఎం స్కీం ఉద్యోగులకు సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఉపేందర్ డిమాండ్ చేశారు. ఎన్‌హెచ్‌ఎం స్కీంలో పని చేస్తున్న కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల సమస్యలపై కలెక్టరేట్ ఎదుట తలపెట్టిన నిరవధిక సమ్మె బుధవారం 7వ రోజుకు చేరింది. సమ్మెలో భాగంగా ఉద్యోగులు కళ్లకు నల్ల గుడ్డలు ధరించి నిరసన తెలిపారు. సంఘం జిల్లా అధ్యక్షుడు దివాకర్, నాయకులు చిరంజీవి, ఎన్‌హెచ్‌ఎం కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఎంప్లాయీస్ యూనియన్ నాయకులు మధుకర్, సదాలక్ష్మి, సదానందం, సాయి, వెంకటేష్, శ్రీదేవి, సౌందర్య, సులోచన, చామంతి, జ్ఞానేశ్వరి, మాయ, లక్ష్మి, చంద్రకళ పాల్గొన్నారు.



నిరసన తెలుపుతున్న ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగులు

సీఎం చిత్రపటానికి వీవోఏల క్షీరాభిషేకం

రెబ్బెన: వీవోఏల వేతనాలు పెంచుతూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయటంతో బుధవారం మండల కేంద్రంలోని మండల సమాఖ్య కార్యాలయంలో వీవోఏలు సీఎం కేసీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. స్వతంత్ర యూనియన్ జిల్లా అధ్యక్షుడు గజ్జెల్లి భీమేశ్ మాట్లాడుతూ ఇన్నాళ్లు తక్కువ వేతనాలకే గ్రామాల్లో స్వయం సహాయక సంఘాల అభివృద్ధికి ఎంతో కృషి చేశామన్నారు. సీఎం కేసీఆర్ వీవోఏలకు వేతనాలు పెంచడం హర్షనీయమని పేర్కొన్నారు. జెడ్పీటీసీ వేముర్ల సంతోష్, సర్పంచులు అహల్యాదేవి, చెన్న సోమశేఖర్, పోషమల్లు, మండల సమాఖ్య అధ్యక్షురాలు వేముర్ల అమృత, ఉపాధ్యక్షురాలు అమృత, డీపీఎం యశోద, ఏపీఎం రాజ్‌కుమార్, ఎంపీటీసీ మదునయ్య, యూనియన్ జిల్లా కార్యదర్శి తిరుపతి, మండల కమిటీ నాయకులు కృష్ణ, లింగన్న, శంకర్, పరమేశ్, ప్రకాశ్, రజిత, సురేఖ, కవిత, శ్రీనివాస్, రవి, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.



క్షీరాభిషేకం చేస్తున్న వీవోఏలు

కాలనీవాసుల సమస్యలు పరిష్కరించాలి

తిర్యాణి: సింగరేణి నిర్వాసిత ఆర్‌అండ్‌ఆర్ కాలనీవాసుల సమస్యలు పరిష్కరించకుండానే డోర్లీ వన్,టూకు సంబంధించి ప్రజాభిప్రాయ సేకరణ జరపడం సరికాదని కాలనీవాసులు పేర్కొన్నారు. బుధవారం బుధవారం మండల కేంద్రంలోని కుమురంభీం చౌరస్తాలో విలేకరుల సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ సింగరేణి నిర్వాసిత ప్రాంతాల్లో కొలాం తెగకు చెందిన గిరిజనులు అధికంగా ఉన్నారని వారి సమస్యలు పరిష్కరించకుండాలనే డోర్లీ వన్,టూ మూసి వేసేందుకు ప్రజాభిప్రాయం సేకరించడం సరికాదన్నారు. ఓసీ ప్రారంభ దశలో అధికారులు ప్రతీరోజు తమ గూడాలకు వచ్చి భూములు ఇవ్వాలని, సమస్యలు పరిష్కరిస్తామని హామీలు ఇచ్చినా ఇప్పటికీ సమస్యలు అలాగే ఉన్నాయన్నారు. మాజీ ఎంపీపీ ఆత్రం లక్ష్మణ్, గంగారం, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కాలనీవాసులు

‘సింహగర్జన సభ’ విజయవంతం చేయాలి



పోస్టర్ ఆవిష్కరిస్తున్న బీసీ నాయకులు

వాంకిడి: హైదరాబాద్‌లోని సరూర్‌నగర్ స్టేడియంలో ఈ నెల 10న నిర్వహించే బీసీల సింహగర్జన మహాసభను విజయవంతం చేయాలని బీసీ విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షుడు లోబడె లహుకుమార్ పిలుపునిచ్చారు. బుధవారం మండల కేంద్రంలో సభలకు సంబంధించిన పోస్టర్‌ను సంఘ నాయకులతో కలిసి ఆవిష్కరించారు. నాయకులు తిరుపతి, శ్రీకాంత్, నవీన్, రాజేశ్వర్, మల్లయ్య, శంకర్ పాల్గొన్నారు.

అందవెల్లి పెద్దవాగు వద్ద బారికేడ్లు ఏర్పాటు



బారికేడ్లు ఏర్పాటు చేసిన అధికారులు

ఆసిఫాబాద్: పెద్దవాగులో నీటి ఉధృతి పెరుగుతుండటంతో కాగజ్‌నగర్ మండలం అందవెల్లి పెద్దవాగు వద్ద రాకపోకలను అధికారులు బుధవారం బారికేడ్లు ఏర్పాటు చేసి నిలిపివేశారు. వరద ఉధృతి పెరుగుతుండడంతో పెద్దవాగులోకి ఎవరూ వెళ్లకుండా ఉండేందుకు బారికేడ్లు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ఎంపీడీవో గౌరీశంకర్, సర్పంచ్ మేకర్తి గంగన్న, పంచాయతీ కార్యదర్శి ఆకాశ్, పాల్గొన్నారు.

కొనసాగుతున్న సమ్మె

ఆసిఫాబాద్‌రూరల్: తమ న్యాయమైన సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సమగ్రశిక్ష ఉద్యోగుల చేస్తున్న సమ్మె బుధవారం జిల్లా కేంద్రంలో కొనసాగింది. సంఘం అధ్యక్షురాలు విజయలక్ష్మి మాట్లాడుతూ సమగ్రశిక్షలో కాంట్రాక్టు పద్ధతిలో పని చేస్తున్న తమ న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలని కోరారు. వీరికి టీయూటీఎఫ్ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి సదాశివ్, నాయకులు ధనరాజ్, శంకర్ మద్దతు తెలిపారు. సంఘం కోశాధికారి నగేశ్, నాయకులు సంతోష్, రమేశ్, మోహన్, సందీప్, మహేష్, సంతోష్, రవి తదితరులు ఉన్నారు.

ఆర్‌ఎంపీ, పీఎంపీల సమస్యలు పరిష్కరిస్తాం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే

కాగజ్‌నగర్‌టౌన్: సిర్పూర్ నియోజకవర్గంలోని ఆయా ప్రాంతాల్లో సేవలు అందిస్తున్న ఆర్‌ఎంపీ, పీఎంపీ వైద్యుల సమస్యలు పరిష్కరించేందుకు కృషి చేస్తానని సిర్పూర్ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప హామీ ఇచ్చారు. బుధవారం పట్టణంలోని త్రిశూల్ పహాడ్‌పై ఆర్‌ఎంపీ, పీఎంపీ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఐక్యత సమావేశాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొని ఎమ్మెల్యే మాట్లాడుతూ మారుమూల, గిరిజన ప్రాంతాల్లో సైతం ఆర్‌ఎంపీ, పీఎంపీ వైద్యులు సేవలు అందిస్తున్నారన్నారు. తాలుకాలోని ఆయా మండలాలకు చెందిన ఆర్‌ఎంపీ, పీఎంపీ వైద్యులు పాల్గొన్నారు.

ప్రభుత్వం ఇచ్చిన హామీని అమలు చేయాలి



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

ఆసిఫాబాద్‌అర్బన్: 2వ ఏఎన్‌ఎంలతో పాటు ఇతర ఏఎన్‌ఎంల సమస్యల పరిష్కారాన్ని త్రీమెన్ కమిటీ త్వరగా చూపాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఉపేందర్ అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలో డీఎంహెచ్‌వోకు తన కార్యాలయంలో 2వ ఏఎన్‌ఎంల సమస్యల పరిష్కారం కోసం వినతిపత్రం సమర్పించారు. ఆయన మాట్లాడుతూ సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం కమిటీ వేస్తామని ప్రకటించగా సమ్మెను తాత్కాలికంగా విరమించినట్లు పేర్కొన్నారు. డిమాండ్లను త్వరగా నెరవేర్చాలని లేకుంటే తిరిగి సమ్మెలోకి వెళ్తామని హెచ్చరించారు. నాయకులు మధుకర్, వసంత, సరస్వతి, లక్ష్మి, పద్మ తదితరులు పాల్గొన్నారు.

జీపీ ట్రాక్టర్ లాక్కెళ్లిన డ్రైవర్

చింతలమానెపల్లి: తనకు రావాల్సిన డబ్బులు చెల్లించడం లేదని గ్రామ పంచాయతీకి చెందిన ట్రాక్టర్‌ను డ్రైవర్ లాక్కెళ్లిన ఘటన మండలంలోని గంగాపూర్‌లో బుధవారం చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. గంగాపూర్ గ్రామ పంచాయతీలో ట్రాక్టర్ డ్రైవర్‌గా కోసన వాగయ్య పని చేస్తున్నాడు. పది నెలలుగా ట్రాక్టర్ డీజిల్ కోసం పంచాయతీ నిధులు రాకపోవడంతో తానే సొంత ఖర్చులతో డీజిల్ కొనుగోలు చేశాడు. ఇప్పటివరకు మొత్తం రూ.1.20 లక్షలు ఖర్చు చేశానని, తన డబ్బులు ఇవ్వాలని పంచాయతీ కార్యాలయంలో సంప్రదించాడు. వారి నుంచి ఎలాంటి స్పందన లేకపోవడంతో వాగయ్య ట్రాక్టర్ స్వాధీనం చేసుకున్నాడు. ట్రాక్టర్ అప్పగించకుంటే చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని పంచాయతీ కార్యదర్శి అశోక్ హెచ్చరించడంతో వాగయ్య ట్రాక్టర్‌ను జీపీ కార్యాలయంలో వదిలేశాడు. కాగా వాగయ్యపై పంచాయతీ కార్యదర్శి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ట్రాక్టర్‌ను శుభ్రం చేయడానికే తీసుకెళ్లినట్లు వాగయ్య చెబుతుండడం గమనార్హం.

అంగన్‌వాడీ కేంద్రాల్లో కిశోరామృతం పంపిణీ

కెరమెరి: పోషక విలువలు కలిగిన ఆహారం తీసుకుంటేనే ఆరోగ్యంగా ఉంటామని ఐసీడీఎస్ సీడీపీవో రెబిక అన్నారు. బుధవారం పోషకాహార వారోత్సవాల్లో భాగంగా మండలంలోని కెరమెరి 2, సుల్తాన్‌గూడ, కెస్లాగూడ, కెలికె, బారెమోడి కేంద్రాల్లో కిశోరామృతం పంపిణీ చేశారు. అనంతరం గర్భిణీలు, బాలింతలు, కిశోరబాలికలకు అవగాహన కల్పించారు. సూపర్‌వైజర్లు కుమారి, లత, అంగన్‌వాడీలు గుణసుందరి, అనుసూయ, అనిత, సక్కుబాయి, మంజుల, చంద్రకళ, సేవంతా, మీరా, సరోజా తదితరులు ఉన్నారు.

పెంచికల్‌పేట్: మండలంలోని పోతెపల్లి అంగన్‌వాడీ కేంద్రంలో బుధవారం కిశోరబాలికలకు పౌష్టికాహారాన్ని సర్పంచ్ దాసరి చంద్రమౌళి అందజేశారు. ఆయన మాట్లాడుతూ ఐసీడీఎస్ ఆధ్వర్యంలో బాలికలకు అందిస్తున్న కిశోరామృతాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అంగన్‌వాడీ టీచర్ రాజమణి, తదితరులు పాల్గొన్నారు.



కెరమెరి: కిశోరామృతం అందజేస్తున్న సీడీపీవో

వాంకిడి: మండల కేంద్రంలోని రాంనగర్ అంగన్‌వాడీ కేంద్రంలో బుధవారం పోషకాహార వారోత్సవాలను నిర్వహించారు. ఈ సందర్భంగా గర్భిణీలు, బాలింతలకు పోషకాహారంపై అవగాహన కల్పించారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో ప్రభుత్వం అందించే పౌష్టికాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలని అధికారులు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ భారతి, అంగన్‌వాడీలు పార్వతీ, లక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

‘ఉన్నతి’తో విద్యార్థులకు నాణ్యమైన విద్యా బోధన

కాగజ్‌నగర్‌టౌన్: ఉన్నతి కార్యక్రమంతో విద్యార్థులకు నాణ్యమైన విద్యా బోధన జరుగుతుందని రాష్ట్ర విద్యా శిక్షణ పరిశోధన సంస్థ ప్రొఫెసర్స్ డాక్టర్ రవికాంత్ రావు, డాక్టర్ అర్జున్‌లు అన్నారు. బుధవారం జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల సర్‌సిల్క్, కాగజ్‌నగర్ ప్రభుత్వ హైస్కూల్, ఓల్డ్ కాగజ్‌గర్ శిక్షణ కేంద్రాలను సందర్శించారు. వారు మాట్లాడుతూ ఉన్నతి ద్వారా ఉన్నత పాఠశాలలో చదువుతున్న విద్యార్థులల్లో కనీస అభ్యాసన సామర్థ్యాలు పెంపొందించవచ్చన్నారు. గుణాత్మక విద్యను అందించడానికి ప్రతీ ఉపాధ్యాయుడు కృషి చేయాలన్నారు. అకాడమిక్ మానిటరింగ్ అధికారి శ్రీనివాస్, కోర్సు డైరెక్టర్లు దేవాజి, శ్రీలత, రిసోర్స్ పర్సన్‌లు తదితరులు ఉన్నారు.

ఉన్నతితో ఉత్తమ బోధన

ఆసిఫాబాద్‌రూరల్: ఉన్నతితో ఉన్నత పాఠశాలల్లో ఉత్తమమైన విద్యా బోధన అందించాలని రాష్ట్ర విద్యా శిక్షణ పరిశోధన సంస్థ ప్రొఫెసర్ డాక్టర్ రవికాంత్ అన్నారు. జిల్లాలోని కాగజ్‌నగర్, ఆసిఫాబాద్‌లో ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులకు జరుగుతున్న ఉన్నతి శిక్షణ కేంద్రాలను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ ఉన్నత పాఠశాలల్లో చదివే విద్యార్థులకు కనీస అభ్యసన సామర్థ్యాలు పెంపొందించడమే కార్యక్రమం ముఖ్యం ఉద్దేశమన్నారు. కార్యక్రమంలో ఎస్‌వో శ్రీనివాస్, డైరెక్టర్లు దేవాజీ, శ్రీలత, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రవికాంత్

ఘనంగా శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు



ఆసిఫాబాద్‌రూరల్: ఉట్టి కొడుతున్న చిన్నారులు



కౌటాలలో..

జిల్లాలో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు బుధవారం ఘనంగా నిర్వహించారు. చిన్నారులను చిన్ని కృష్ణుడు, గోపికల వేషధారణలతో ముస్తాబు చేసి తల్లులు మురిసిపోయారు. ఆయా పాఠశాలల్లో చిన్నారుల వేషధారణలు ఎంతగానో ఆకట్టుకున్నాయి. **- సాక్షి నెట్‌వర్క్**



రెబ్బెనలోని పాఠశాలలో చిన్ని కృష్ణుడు, గోపికల వేషధారణల్లో విద్యార్థులు